
# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

వరంగల్ | శుక్రవారం - 06 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 277 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

ఘనంగా భట్టి విక్రమార్క కుమారుడి వివాహం



విరోష్ దంపతులను కలిసిన ముఖ్యమంత్రి

2లో

## టోలీచౌకి ఘటనపై మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందన

అధికారులతో ఫోన్‌లో సమీక్ష

రక్షణ చర్యలు వేగవంతం చేయాలని ఆదేశం

గాయపడిన కార్మికులకు తక్షణ చికిత్స



2లో

## మూసీ సుందరీకరణపై సబితా ఇంద్రారెడ్డి విమర్శలు

- ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు
- లక్ష కుటుంబాలు రోడ్డున పడతాయన్న వ్యాఖ్యలు
- కేసీఆర్ పాలనను ప్రశంసించిన సబితా



2లో

# తిరుమలాయపాలెంలో 100 పడకల ఆసుపత్రి

### రూ.26 కోట్లతో ఆధునిక వైద్యసదుపాయాలు

### డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశం

### పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం లక్ష్యం.. మంత్రి పొంగులేటి

**ఖమ్మం, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):**

ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రూ.26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఏరియా ఆసుపత్రి భవనానికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం మరియు సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పేదవాడి సొంత ప్రాంతంలోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో కేవలం 30 పడకలతో అరకొర సదుపాయాలున్న ఆసుపత్రి మాత్రమే ఉండడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చేదని మంత్రి గుర్తు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఖమ్మం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. కొత్తగా నిర్మించనున్న ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్లు, అత్యాధునిక వైద్య పరికరాలు మరియు మెరుగైన వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వైద్యసిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.

మిగతా 2లో..



## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

### ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా బదిలీ


**హైదరాబాద్, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ నూతన గవర్నర్‌గా ప్రస్తుతం హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా వ్యవహరిస్తోన్న శివప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. ప్రస్తుత తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మహారాష్ట్ర గవర్నర్‌గా, తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్రపతి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. నాగాలాండ్ గవర్నర్‌గా నంద్‌కిశోర్ యాదవ్, బిహార్ గవర్నర్‌గా విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హస్నైన్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించారు.



## టోలీచౌకిలో నిర్మాణ ప్రమాదం

- గోవా కర్రలు కూలి నలుగురు మృతి
- ఆరుగురికి తీవ్ర గాయాలు
- సహాయక చర్యలు కొనసాగింపు



2లో

## ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి సాధ్యం: కేటీఆర్

### మూసీ సుందరీకరణపై వ్యాఖ్యలు

హైడ్రా చర్యలపై విమర్శలు.. ప్రభుత్వానికి సవాల్ విసిరిన కేటీఆర్




2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఘనంగా భట్టి విక్రమార్క కుమారుడి వివాహం

- హైదరాబాద్‌లో వైభవంగా వేడుకలు
- ముఖ్యమంత్రి, మంత్రుల హాజరు
- రాజకీయ, సినీ ప్రముఖుల సందడి



**హైదరాబాద్, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం సాక్షితో హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. శంషాబాద్ సమీపంలోని ప్రముఖ వేదికలో జరిగిన ఈ వివాహ వేడుకకు రాష్ట్ర రాజకీయ, సామాజిక మరియు సినీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మరియు ఆహ్వానితుల సమక్షంలో సంప్రదాయ పద్ధతుల్లో వివాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం రాజకీయ నాయకులతో పాటు వివిధ రంగాల ప్రముఖులతో కళకళలాడింది. ఈ వివాహ వేడుకకు సినీ రంగానికి చెందిన ప్రముఖులు కూడా హాజరై దంపతులను ఆశీర్వదించారు. ప్రముఖ నటులు చిరంజీవి, ప్రకాశ్ రాజ్ వంటి వారు కార్యక్రమానికి హాజరైనట్లు సమాచారం. వారి రాకతో వేడుకకు మరింత ప్రత్యేకత ఏర్పడింది. వివాహ కార్యక్రమం సంప్రదాయ ఆచారాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా జరిగింది. అతిథులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఆతిథ్యాన్ని అందించారు. రాష్ట్రవ్యాప్తంగా నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ఆహ్వానితులు కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందించారు. కుటుంబ సభ్యులు ఈ వేడుకను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

# విజయ్ దేవరకొండ రష్మిక దంపతులను కలిసిన ముఖ్యమంత్రి

- నివాసంలో మర్యాదపూర్వక భేటీ
- నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం
- వివాహానంతరం ప్రముఖుల సందడి



**హైదరాబాద్, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల వివాహబంధంతో ఒక్కటైన సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆశీర్వదించారు. విజయ్ దేవరకొండ మరియు రష్మిక ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. ఈ వివాహం తెలుగు సినీ పరిశ్రమలో ప్రముఖ చర్చనీయాంశంగా మారింది. వివాహానంతరం హైదరాబాద్‌లో ఘనంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఈ వేడుకలో టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ నటులు పాల్గొని దంపతులకు ఆశీస్సులు అందించారు. అదేవిధంగా వివాహ వేడుకల అనంతరం దంపతులు దేశంలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు సమాచారం. అభిమానులతో ఆనందాన్ని పంచుకునే భాగంగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో మిఠాయిలను పంపిణీ చేసినట్లు కూడా తెలిసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేయడం విశేషంగా మారింది. ఈ భేటీ సందర్భంగా సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# తిరుమలాయపాలెంలో 100 పడకల ఆసుపత్రి

(మొదటి పేజీ తరువాయి)




ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి ఆసుపత్రి భవనాలు నిర్మించినప్పటికీ డాక్టర్లు అందుబాటులో ఉండకపోతే ప్రజలకు ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. డాక్టర్లు, సిబ్బంది ఆసుపత్రి ప్రధాన కేంద్రంలోనే నివసిస్తూ రోగులకు సేవలు అందించాలని సూచించారు. విధుల్లో నిబద్ధతతో పనిచేసే సిబ్బందిని ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి చెప్పారు. మార్చిలో ప్రారంభమయ్యే ఈ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ నాటికి ఆసుపత్రిని ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి సాధ్యం: కేటీఆర్

- మూసీ సుందరీకరణపై వ్యాఖ్యలు
- హైడ్రా చర్యలపై విమర్శలు
- ప్రభుత్వానికి సవాల్ విసిరిన కేటీఆర్

**హైదరాబాద్, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి మరియు సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మూసీ పరివాహక ప్రాంతంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా కూడా అభివృద్ధి సాధ్యమని అది నిదర్శనమని పేర్కొన్నారు.

హైదరాబాద్ నగరంలోని నాగోల్ ప్రాంతంలో ఉన్న మలినజల శుద్ధి కేంద్రాన్ని కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలకు ఎలాంటి నియంత్రణ లేకుండా పోయిందని విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చివేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణ పనులకు రూ.1.50 లక్షల కోట్లు అవసరమని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అయితే అదే పనులను రూ.16 వేల కోట్లతోనే పూర్తి చేయవచ్చని కేటీఆర్ అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు తక్కువ వ్యయంతోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. మూసీ సుందరీకరణ పనులను తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లతోనే పూర్తి చేసి చూపిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు ఒక్క ఇంటినైనా నిర్మించినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన సవాల్ విసిరారు.



# టోలీచౌకి ఘటనపై మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందన

**హైదరాబాద్, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లోని టోలీచౌకి ప్రాంతంలో జరిగిన నిర్మాణ ప్రమాద ఘటనపై రాష్ట్ర కార్మిక మరియు ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి స్పందించారు. ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే ఆయన కార్మిక శాఖకు చెందిన అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదంలో గాయపడిన కార్మికులకు తక్షణ వైద్య చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రక్షణ చర్యలను వేగవంతం చేసి బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే సేకరించాలని కూడా మంత్రి తెలిపారు. ప్రమాదానికి కారణాలు ఏమిటి అనే అంశంపై సమగ్రంగా విచారణ చేపట్టాలని అధికారులకు సూచించారు. గాయపడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై పూర్తి నివేదికను సమర్పించాలని కూడా మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# మూసీ సుందరీకరణపై సబితా ఇంద్రారెడ్డి విమర్శలు

**హైదరాబాద్, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. కేసీఆర్ పాలనలో అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా మానవత్వం కనిపించిందని ఆమె పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజలు ఎంత ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ కారణంగా లక్ష కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. పేదల ఇళ్లను కూల్చివేయడం వల్ల అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని ఆమె అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న తొమ్మిదేళ్ల కాలంలో పేదల కోసం లక్ష ఇళ్లను నిర్మించారని ఆమె గుర్తు చేశారు. పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం చేపడుతున్న మూసీ సుందరీకరణ పనులతో లక్ష కుటుంబాలను రోడ్డున పడేయాలని ప్రభుత్వం చూస్తోందని ఆమె విమర్శించారు. ప్రజల సమస్యలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సబితా ఇంద్రారెడ్డి కోరారు.

# టోలీచౌకిలో నిర్మాణ ప్రమాదం

**హైదరాబాద్, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగరంలోని టోలీచౌకి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఘోర ప్రమాదం జరిగింది. నాలుగు అంతస్తుల భవనం నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన గోవా కర్రల పరంజా కుప్పకూలడంతో నలుగురు కార్మికులు మృతి చెందగా, ఆరుగురు కార్మికులు గాయపడ్డారు. ప్రమాద సమయంలో అక్కడ సుమారు 10 నుంచి 12 మంది కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం. పరంజా ఒక్కసారిగా కూలిపోవడంతో అక్కడికక్కడే ముగ్గురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన మరో కార్మికుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిసింది. గాయపడిన కార్మికులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులని ప్రాథమిక సమాచారం అందింది. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, రెవెన్యూ అధికారులు మరియు రెస్క్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మట్టిలో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన అనంతరం భవనం నిర్మాణదారుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# డ్వాక్రా మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు

- 42 లక్షల మహిళలకు ఆరోగ్య పరీక్షలు
- టీ-డయాగ్నస్టిక్స్ ద్వారా 30 రకాల పరీక్షలు
- డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ ఏర్పాటు



**డెస్క్, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని డ్వాక్రా మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. సుమారు 42 లక్షల డ్వాక్రా మహిళలకు ఉచితంగా సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా టీడయాగ్నస్టిక్స్ ద్వారా ప్రతి మహిళకు సుమారు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. రక్తపరీక్షలు, ఇతర కీలక ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన వైద్య సేవలు కూడా అందించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పరీక్షల అనంతరం ప్రతి మహిళకు ప్రత్యేకంగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించనున్నారు. భవిష్యత్తులో అవసరమైనప్పుడు వారి వైద్య వివరాలు అందుబాటులో ఉండేలా ఈ ప్రొఫైల్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆరు నెలల కాలంలో నాలుగు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి దామోదర రాజనరసింహ తెలిపారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.



## ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన కాప్రా ప్రింట్ మీడియా ప్రతినిధులు

**కాప్రా, మార్చ్ 05 (తెలంగాణ ముచ్చట్లు):**

నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రధాన పత్రికల సీనియర్ జర్నలిస్టుల తో కూడిన ప్రెస్ క్లబ్ కార్యవర్గం గురువారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించింది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రధాన పత్రికల ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులకు ఎంపీ ఈటల రాజేందర్ అభినందనలు తెలిపారు. జర్నలిస్టులు సమాజానికి మార్గదర్శకులని పేర్కొంటూ, వారి సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు .ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు జ్యోతిర్మయ చారి, ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్, ఉపాధ్యక్షులు పలుగుల పవన్, లక్కిడి బాలరెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి గడ్డమీద బాలరాజు గౌడ్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ జర్నలిస్టులు కేసీ మోహన్, క్యాసాని సత్యనారాయణ, సహదేవా చారి, వేముల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆడబిడ్డ పెళ్లికి సర్పంచ్ కానుకగా 5,016 అందజేత

**వేలేరు, మార్చ్ 05 (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలంలోని పీచర గ్రామానికి చెందిన మరిజే రజిత-లక్ష్మణ్ రావు దంపతుల కనిష్ట కుమార్తె వైష్ణవి వివాహం నరేష్‌తో పీచర గ్రామంలో ఘనంగా జరిగింది. వారి ఆహ్వానం మేరకు గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను నిండు మనసుతో ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డ పెళ్లి సందర్భంగా సర్పంచ్‌గా 5,016 నగదును పెళ్లి కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ మోరే జైపాల్, కదుగయ చందర్ రావు, మరిజే మోహన్ రావు, గుడికందుల రమేష్, బాపురావు, మనోహర్, రమేష్, అశోక్, ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ గ్రామంగా గోపాల్‌పూర్ సర్పంచ్ కర్రే లక్ష్మి కృషి

**ఎల్కతుర్తి. మార్చ్ 05:( తెలంగాణ ముచ్చట్లు)**



ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సర్పంచ్ కర్రే లక్ష్మి ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారు. గ్రామ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రతి రోజు ఉదయం గ్రామంలో తిరుగుతూ పరిశుభ్రత పనులు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి సరఫరా వంటి సమస్యలను పరిశీలిస్తూ వెంటనే పరిష్కారం చూపిస్తున్నారు. గ్రామంలో ఎక్కడైనా సమస్య ఉన్నట్లు తెలిసినా తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

గ్రామంలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ కాలువల శుభ్రపరచడం, చెత్త నిర్వహణ, తాగునీటి సౌకర్యాల మెరుగుదల వంటి పనులు కొనసాగుతున్నాయి. గ్రామ ప్రజల సహకారంతో అన్ని విభాగాల్లో గోపాల్‌పూర్‌ను ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని సర్పంచ్ కర్రే లక్ష్మి తెలిపారు.

గ్రామ అభివృద్ధి కోసం అందరూ ఒకే తాటిపై నిలబడి కలిసి పనిచేస్తే గోపాల్‌పూర్‌ను నిజమైన ఆదర్శ గ్రామంగా మార్చగలమని ఆమె అన్నారు. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా గ్రామాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని ఆమె స్పష్టం చేశారు.

అలాగే రాబోయే రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గోపాల్‌పూర్‌ను మండలంలోనే కాక జిల్లాలో కూడా ఒక మోడల్ విలేజ్‌గా నిలపాలని సంకల్పంతో పనిచేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

# వనపర్తి జిల్లా బీజేపీ దళిత మోర్చా అధ్యక్షుడిగా గంధం ప్రవీణ్ కుమార్ నియామకం

**వనపర్తి,మార్చ్5(తెలంగాణ ముచ్చట్లు):**



భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా గంధం ప్రవీణ్ కుమార్‌ను నియమించారు. జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఆధ్వర్యంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, మున్నూరు రవీందర్, పురుషోత్తం రెడ్డి, లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గంధం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర మరియు జిల్లా పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గడపకు పార్టీ సిద్ధాంతాలు మరియు జాతీయ భావాన్ని తీసుకెళ్లి, సమాజంలో ఉన్న అసమానతలను తొలగించే దిశగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# గ్రామపంచాయతీ సిబ్బంది మృతి... బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**పెద్దమందడి,మార్చ్4(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది వెంకటయ్య మృతి చెందిన నేపథ్యంలో గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పరిస్థితిని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి తాను ఎల్లవేళలా అండదండగా ఉంటానని భరోసా కల్పించారు. కుటుంబానికి ఎదురవుతున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా యువసేవ సమితి

- 1500 పరీక్ష ప్యాడ్ల పంపిణీ
- సేవా కార్యక్రమాలకు యువత ముందుకు రావాలని పిలుపు

**సత్తుపల్లి, మార్చి 5 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అండగా నిలుస్తూ యువసేవ సమితి ఆధ్వర్యంలో 1500 పరీక్ష ప్యాడ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి యుపిఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ప్రారంభించారు. జొన్నలగడ్డ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు హాజరై విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా సహకారంతో విద్యార్థులకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేయడం విశేషంగా నిలిచింది. పరీక్షల సమయం సమీపిస్తున్న వేళ విద్యార్థులకు అవసరమైన పరికరాలను అందించడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ యువసేవ సమితి చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని సూచించారు. యువత ఎక్కువ సంఖ్యలో ముందుకు వచ్చి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో విద్య, ఆరోగ్యం, పర్యావరణం వంటి రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ రెహానా కమల్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అన్నారు. యువసేవ సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కాంగ్రెస్ నాయకుడు బొంతు వేణు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు యువసేవ సమితి ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.






# పాఠశాల బస్సు డ్రైవర్లకు వైద్య పరీక్షలు

- పోలీస్ కమిషనర్ ఆదేశాలతో సత్తుపల్లిలో ప్రత్యేక శిబిరం

**సత్తుపల్లి, మార్చి 5 (తెలంగాణ ముచ్చట్లు):**

విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్లకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ మెడ్ సహకారంతో నిర్వహించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు, రక్తంలో చక్కెర స్థాయిలు (షుగర్), రక్తపోటు (బీపీ) తదితర పరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి తగిన సూచనలు, జాగ్రత్తలు వివరించారు. విద్యార్థుల రవాణాలో కీలక పాత్ర పోషించే డ్రైవర్లు ఆరోగ్యంగా ఉండడం అత్యంత అవసరమని అధికారులు పేర్కొన్నారు. పాఠశాల బస్సులు నడిపే వారు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం సీఐ తుమ్మలపల్లి శ్రీహరి ఆధ్వర్యంలో జరిగింది. ఎస్సై ప్రదీప్, లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు నాయుడు వెంకటేశ్వరరావు, ప్రభాకరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రమేష్, గోగడ రవికుమార్, మురళి, శ్రీనివాసరావు, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు సహకారం అందిస్తా

- మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి

**ఉప్పల్,మార్చి05(తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు తన వంతు సహకారం అందజేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టియూడబ్ల్యుజె) మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రాంరెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం అధ్యక్షులు పల్లా మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ని గురువారం నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కలిశారు. ఈ మేరకు రెండవసారి చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా మీడియా అకాడమీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి, శాలువా తో సత్కరించారు. అనంతరం ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వి.తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి.శివాజీ లు కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో కూడిన మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు సహకారం అందజేస్తామన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు. జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు..ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారెల్లి సాగర్, ఉపాధ్యక్షులు శ్రీధర్ రావు, నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజు, ఓ.రమేష్ పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## స్టాలిన్ 73వ వర్ధంతి సందర్భంగా సీపీఎం సంస్మరణ సభ

**మల్కాజిగిరి, మార్చి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కమలానగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రపంచ కమ్యూనిస్టు నాయకుడు కామ్రేడ్ జోసఫ్ స్టాలిన్ 73వ వర్ధంతి సందర్భంగా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నాయకులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జోసఫ్ స్టాలిన్ చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, సీనియర్ నాయకులు జనార్ధన్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కోమటి రవి మాట్లాడుతూ జోసఫ్ స్టాలిన్ గొప్ప విప్లవ యోధుడని పేర్కొన్నారు. లెనిన్ నాయకత్వంలో రష్యా విప్లవం విజయవంతం కావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. లెనిన్ అనంతరం సోవియట్ యూనియన్ అభివృద్ధికి, అలాగే హిట్లర్ నియంతృత్వానికి వ్యతిరేకంగా ప్రపంచాన్ని రక్షించడంలో స్టాలిన్ కీలకంగా పోరాడారని చెప్పారు. అనేక దేశాలు స్వాతంత్ర్యం సాధించడానికి సోవియట్ యూనియన్ విజయాలు ప్రేరణగా నిలిచాయని పేర్కొన్నారు.అనంతరం జనార్ధన్ రెడ్డి, శ్రీమన్నారాయణ, గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ స్టాలిన్ మరణానంతరం కొంతమంది బూర్జువా మేధావులు, మితవాద శక్తులు ఆయనపై విమర్శలు చేసినప్పటికీ, ఆయన చేసిన పోరాటం మరియు త్యాగం మానవాళి పురోగతిలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు .ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, శోభ, శారద, శేఖర్ రెడ్డి, లక్ష్మయ్య, ఉదయ భాస్కర్, శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు, కే. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యసభ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు

**ఉప్పల్, మార్చి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థిగా వేం నరేందర్ రెడ్డిని ఎంపిక చేయడంపై ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారుగా సేవలందిస్తున్న వేం నరేందర్ రెడ్డికి రాజ్యసభ అభ్యర్థిత్వం దక్కడం అభినందనీయమని అన్నారు.ఈ సందర్భంగా గురువారం వేం నరేందర్ రెడ్డిని ఉప్పల్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు మందుముల పరమేశ్వర్ రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సా రెడ్డి, బూపతి రెడ్డి కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఆయన రాజ్యసభలో తెలంగాణ ప్రజల సమస్యలను బలంగా ప్రస్తావిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కుల అందజేత

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా 8 మంది విద్యార్థులకు ఆర్థిక సహాయం
- బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యక్రమం

**ఉప్పల్, మార్చి 5 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు. బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మొత్తం 8 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు వారి వైద్య విద్యకు అయ్యే ఫీజుల కోసం చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, వైద్య విద్య చదువుతున్న విద్యార్థులకు ఇలాంటి సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, కాప్రా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భైరి నవీన్ గౌడ్, చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## సీఎం కప్ తైక్వాండోలో మోజెర్ల విద్యార్థుల సత్తా

- హెవెన్లీ గేట్ స్కూల్‌కు గోల్డ్, సిల్వర్ పథకాలు

**పెద్దమందడి,మార్చ్5(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజెర్ల హెవెన్లీ గేట్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో ప్రతిభ చాటారు.ఫిబ్రవరి 22, 23 తేదీలలో హైదరాబాద్ గచ్చిబౌలి క్రీడా మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2026లో పాల్గొని పలు పథకాలు సాధించారు.ఈ పోటీలలో రేష్వంత్ రామ్, తేజవర్ధన్, అజయ్, ఎం. హారిక, దీక్షిత గోల్డ్ పథకాలు సాధించగా, దీక్షిత, ఎం. కావ్య, భవ్యశ్రీ సిల్వర్ పథకాలు అందుకున్నారు.మాస్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు శిక్షణ పొందుతూ ఈ విజయాన్ని సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గట్టు దయాకర్ తెలిపారు.గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు సీఎం కప్ నిర్వాహకులు అందజేసిన పథకాలను ప్రిన్సిపాల్ గట్టు దయాకర్ వారి మెడలో వేసి అభినందించారు.భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.అలాగే విద్యార్థులకు శిక్షణ అందించిన కోచ్ రవికుమార్‌ను, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులను ప్రిన్సిపాల్ అభినందించారు.

## చర్లపల్లి సర్వే నం.186/4లో భూపోరు రంగంలోకి హైడ్రా

**చర్లపల్లి, మార్చి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని సర్వే నంబర్ 186/4 భూమి విషయంలో వివాదం చెలరేగింది. ఈసీ నగర్ సొసైటీ సభ్యులు మరియు మరో వర్గం మధ్య భూస్వామ్యంపై వివాదం నెలకొనడంతో గురువారం హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.ఈసీ నగర్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. లేఅవుట్ ప్రకారం ఈ స్థలం ఓపెన్ స్పేస్‌గా ఉండి, నిబంధనల ప్రకారం ఇప్పటికే జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్ ద్వారా అప్పగించామని తెలిపారు.ఇది ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలమని వారు పేర్కొన్నారు.అయితే మరో వర్గం మాత్రం ఈ భూమి తమ పట్టా భూమి అని, హైకోర్టు ఆదేశాల మేరకు ఏడీ సర్వే నిర్వహించి అధికారులు బౌండరీలను డీమార్క్ చేసి తమకు అప్పగించారని వాదించింది.ఇరువర్గాల వాదనలు విన్న హైడ్రా అధికారులు తక్షణ నిర్ణయం తీసుకోకుండా, సంబంధిత పత్రాలను సమర్పించాలని సూచించారు. సేల్ డీడ్లు, గిఫ్ట్ డీడ్, కోర్టు ఉత్తర్వులు, ఏడీ సర్వే నివేదికలను కార్యాలయానికి అందించాలని ఆదేశించారు.



కోట్ల రూపాయల విలువైన ఈ భూమిపై తుది నిర్ణయం తీసుకునే విషయంలో జీహెచ్ఎంసీ పాత్ర కీలకమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పత్రాల పరిశీలన అనంతరం రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి హైడ్రా అధికారులు తుది నిర్ణయం తీసుకోనున్నారు. అప్పటి వరకు స్థలంలో యథాతథ స్థితిని కొనసాగించాలని అధికారులు సూచించినట్లు సమాచారం.

## అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా

- ట్రాక్టర్ ఇసుక రూ.1000కే అందించాలి
- జి. రవికుమార్ రాజ్యాధికార పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు

**మదనాపురం,మార్చ్5(తెలంగాణ ముచ్చట్లు):**

గ్రామాల్లో నిత్యం ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు జి. రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..మండలంలోని పలు గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇసుక రవాణాను నియంత్రించి, వాల్టా చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయని తెలిపారు.ప్రస్తుతం ఒక ట్రాక్టర్ ఇసుక ధర రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని, దీంతో ఇసుక బంగారంలా మారిందని విమర్శించారు.సామాన్య ప్రజలు ఇల్లు నిర్మించుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ట్రాక్టర్ ఇసుక ధరను రూ.1000గా నిర్ణయించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇసుక ధరలు పెరగడం వల్ల మధ్యతరగతి ప్రజల సొంతింటి కలలు దూరమవుతున్నాయని తెలిపారు.ఇప్పటికైనా మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.వ



## మత్తు పదార్థాల మాయలో పడొద్దు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం





కీసర జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు

- విజేతలకు నగదు బహుమతులు అందజేసిన వీ చారిటీ ఫౌండేషన్

**కీసర, మార్చి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

మత్తు పదార్థాలు, డ్రగ్స్, మత్తు పానీయాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు కీసర మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వీ చారిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి సౌజన్యంతో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కీసర పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధూజ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలు, డ్రగ్స్, మత్తు పానీయాలు యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. ఇవి మెదడు, గుండె, కాలేయం వంటి ముఖ్య అవయవాలను దెబ్బతీస్తాయని, మానసిక సమస్యలకు కూడా దారి తీస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టి ఇటువంటి చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, డ్రగ్స్ వాడకం భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు నేరాలకు దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.వీ చారిటీ ఫౌండేషన్ చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు అవసరమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే మత్తు వ్యసనాలపై అవగాహన కల్పిస్తే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.పోటీల్లో మొదటి బహుమతి (రూ.3000) బోయ విఘ్నేశ్వరి (10వ తరగతి), రెండో బహుమతి (రూ.2000) సౌభియా (9వ తరగతి), మూడో బహుమతి (రూ.1000) సీమా భుష్రా (8వ తరగతి), కన్సోలేషన్ బహుమతి (రూ.1000) జగ్గుల కిరణ్ కుమార్ (10వ తరగతి) అందుకున్నారు.ఈ కార్యక్రమంలో కీసర మండల బీజేపీ సీనియర్ నాయకుడు మెట్టు మహేందర్ యాదవ్, ఉపాధ్యాయులు కె. రవి చంద్రశేఖర్, ఆర్. వెంకటేశ్వర్లు, బి. వెంకటేశ్వర్లు, రామాదేవి, సుభద్రా దేవి, ఆర్. ఆనంద్, డి. సుశీలత, వై. చంద్రారెడ్డి, పి. చందర్, ఏపీసీ చైర్మన్ జబీనా ఫాతిమా పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎండాకాలం నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల పని సమయాల్లో మార్పులు

- మధ్యాహ్న హాజరు నమోదు గంట ముందుకు
- కార్మికుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం

**మల్కాజ్గిరి, మార్చి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతను మెరుగుపర్చేందుకు పని గంటలలో స్వల్ప మార్పులు చేయాలని మల్కాజిగిరి నగరపాలక సంస్థ కమిషనర్ టి. వినయ్ క్రిష్ణారెడ్డి, ఐఏఎస్ నిర్ణయించారు. ప్రతి సంవత్సరం వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో కార్మికులు ఎండ తీవ్రతకు గురికాకుండా ఉండేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.కొత్తగా నిర్ణయించిన సమయాల ప్రకారం పారిశుధ్య కార్మికుల హాజరు నమోదు ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు కొనసాగుతుంది. ఇప్పటి వరకు మధ్యాహ్న హాజరు నమోదు 1 గంట నుంచి 2 గంటల వరకు ఉండేది.ఎండాకాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా కార్మికులు అనారోగ్యానికి గురికాకుండా ఉండేలా ఒక గంట ముందుగానే మధ్యాహ్న హాజరు నమోదు చేయాలని నిర్ణయించినట్లు పారిశుధ్య విభాగం అదనపు కమిషనర్ సి.ఎస్. రఘుప్రసాద్ తెలిపారు.ఈ మార్పులు వెంటనే అమల్లోకి వస్తాయని మల్కాజిగిరి నగరపాలక సంస్థ అధికారులు వెల్లడించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నూతన వస్త్రాల అందజేత

**దొడగుంటపల్లిలో గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరు**

**పెద్దమందడి,మార్చ్5(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మేకల వెంకటయ్య-తిరుపతమ్మ, ఈడిమాకుల కృష్ణయ్య-నారమ్మ, కురుమూర్తి లక్ష్మీ కుటుంబాలకు నూతన వస్త్రాలను అందించి అభినందించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ..ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇంటి నిర్మాణం తమ కలగా ఉండేదని, ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేక అద్దె ఇళ్లలోనే జీవనం గడిపామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇందిరమ్మ ఇంటి పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు కావడంతో తమ సొంతింటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృషి ఎంతో ఉందని కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మండల మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి, శంకర్ నాయక్, మండల అధ్యక్షుడు రవి కిరణ్, న్యాయవాది తిరుపతయ్య, పిసిసి సభ్యుడు శంకర ప్రసాద్, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఐ సత్య రెడ్డి, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాజ్యసభ బరిలో వేం నరేందర్ రెడ్డి.. శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి,మార్చ్5(తెలంగాణ ముచ్చట్లు):**



రాజ్యసభ సభ్యుడిగా ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి పేరును ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఖరారు చేసింది. ఈ క్రమంలో గురువారం ఆయన అసెంబ్లీ సెక్రటరీకి తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.ఈ నామినేషన్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.


# పిడిఎస్‌యూ జాతీయ కమిటీ సభ్యునిగా పవన్ కుమార్ ఎన్నిక

**వనపర్తి, మార్చి5(తెలంగాణ ముచ్చట్లు):**




ఐదు దశాబ్దాల గొప్ప ఉద్యమ చరిత్ర కలిగిన విప్లవ విద్యార్థి సంఘం పిడిఎస్‌యూ ప్రథమ జాతీయ మహాసభలు మార్చి 3, 4 తేదీలలో విజయవాడ నగరంలోని సింగ్ నగర్‌లో గుజ్జల సరళాదేవి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ మహాసభల్లో వనపర్తి జిల్లాకు చెందిన కే. పవన్ కుమార్ జాతీయ కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.2010 సంవత్సరం నుండి సాధారణ కార్యకర్తగా ఉద్యమ జీవితం ప్రారంభించిన పవన్ కుమార్ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి, ప్రస్తుతం జాతీయ స్థాయికి ఎదిగారు. ఆయన ఎన్నిక వనపర్తి జిల్లాలోని విద్యార్థి లోకానికి కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ.. శాస్త్రీయ విద్య సాధన లక్ష్యంగా, సమసమాజ స్థాపన ధ్యేయంగా అందరికీ సమాన విద్య అందేలా సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ మహాసభల్లో పలు ముఖ్య తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడులను ఖండించడం, ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ నిబంధనలను పటిష్టంగా అమలు చేయడం, విద్యను వ్యాపార సరుకుగా మార్చే ఒప్పందాల నుంచి భారత్ బయటకు రావాలని కోరడం, నూతన జాతీయ విద్యా విధానం-2020ను రద్దు చేయాలని డిమాండ్ చేయడం, విశ్వవిద్యాలయాల్లో ఖాళీలను భర్తీ చేయడం, విద్యార్థినులు మరియు మహిళలపై లైంగిక దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలను అమలు చేయడం వంటి తీర్మానాలు చేశారు.విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘ ఎన్నికలను నిర్వహించాలని కూడా మహాసభలు తీర్మానించాయి.వనపర్తి జిల్లా నుండి జాతీయ స్థాయికి ఎదిగిన ఈ నాయకత్వం భవిష్యత్తులో విద్యార్థి ఉద్యమాలకు దిశానిర్దేశం చేస్తుందని, జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం సంఘం మరింత బలోపేతం అవుతుందని జిల్లా నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.





# నూతన వధూవరులకు మంత్రి పొంగులేటి ఆశీర్వాదం

**ఖమ్మం బ్యూరో, మార్చి 5(తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. తన నియోజకవర్గంతో పాటు జిల్లాలోని పలు మండలాల్లో జరిగిన వివాహ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు పట్టు వస్త్రాలను కానుకగా అందించి, వారు "నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో చల్లగా ఉండాలి" అని దీవించారు.

కూసుమంచి : మండల కేంద్రంలోని శ్రీ విజయరామ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బోనగిరి వెంకటేశ్వరరావు కుమారుని వివాహ వేడుకకు మంత్రి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఖమ్మం నగరం : ఖానాపురంలోని మొగిలి పాపిరెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఇంటూరి పుల్లయ్య కుమారుని పెళ్లికి, ఖమ్మం బైపాస్ రోడ్డులోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎంపీఓ చిప్పా శివ కుమార్తె వివాహానికి హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు అందజేశారు.

రెడ్డిపల్లి (ఏదులాపురం): ఏఆర్ గార్డెన్స్‌లో జరిగిన మద్దినేని అశోకరావు కుమారుని వివాహ వేడుకలో పాల్గొని వధూవరులకు పట్టువస్త్రాలు బహూకరించారు. ఏన్కూరు & తల్లాడ: ఏన్కూరు మండలం నాచారంలో ముక్తి వెంకటేశ్వర్లు కుమారుని వివాహానికి, తల్లాడ మండలం కుర్నవల్లిలో అయిలూరి శ్రీనివాసరెడ్డి కుమారుని వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను దీవించారు.

# నాగిలిగొండలో నూతన చేతిపంపు ప్రారంభం

**ఖమ్మం బ్యూరో, మార్చి 05 (తెలంగాణ ముచ్చట్లు)**

చింతకాని మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేతిపంపును గురువారం గ్రామ సర్పంచ్ వేపూరి పద్మ ఘనంగా ప్రారంభించారు. స్థానిక జి ఎస్ ఎస్ చర్చి ప్రాంగణంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ బోరు బావిని నిర్మించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామస్తుల సౌకర్యార్థం నీటి వసతి కల్పించడం సంతోషదాయకమని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక చర్చి పాస్టర్, గ్రామ పెద్దలు, సంఘ పెద్దలు మరియు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. చేతిపంపు అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# అర్ధరాత్రి ఆపదొస్తే.. ఖమ్మం పరుగు తీయాల్సిన అవస్థలు ఇక ఉండవు!

- **గిరిజన బిడ్డల ప్రాణాలకు మంత్రి పొంగులేటి భరోసా..**
- **తిరుమలాయపాలెంలో రూ. 26 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రికి శంకుస్థాపన**
- **డిసెంబర్ కల్లా పనులు పూర్తి కావాలి.. కాంట్రాక్టర్‌కు ఆదేశాలు**

**ఖమ్మం బ్యూరో, మార్చి 5(తెలంగాణ ముచ్చట్లు)**



"అర్ధరాత్రి వేళ ఆపద వస్తే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఖమ్మం పరుగు తీయాల్సిన కష్టాలు ఈ ప్రాంత గిరిజన బిడ్డలకు ఇక ఉండవు. పేదవాడి సొంత గడ్డపైనే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే మన ప్రజా ప్రభుత్వ లక్ష్యం" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సుమారు రూ. 26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

**జిల్లా ఆసుపత్రిని మరిపించేలా వసతులు**

గతంలో కేవలం 30 పడకలతో, అరకొర వసతులతో ఉన్న ఈ ఆసుపత్రి వల్ల ప్రజలు పడ్డ ఇబ్బందులను మంత్రి గుర్తు చేసుకున్నారు. "నాడు ప్రసవం కావాలన్నా, అత్యవసర చికిత్స కావాలన్నా ఖమ్మం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లడం తప్ప మరో మార్గం ఉండేది కాదు.

కానీ ఇప్పుడు మన ప్రజా ప్రభుత్వం వచ్చాక, జిల్లా హెడ్ క్వార్టర్ ఆసుపత్రిని మరిపించేలా ఇక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నాం. డయాలసిస్ యూనిట్లు, అత్యాధునిక పరికరాలతో కూడిన వైద్యాన్ని రాబోయే కొద్ది నెలల్లోనే ఇక్కడ అందుబాటులోకి తెస్తాం" అని భరోసా ఇచ్చారు.

**వైద్యులు దేవుళ్లతో సమానం.. ఇక్కడే ఉండాలి!**

వైద్య సిబ్బంది పనితీరుపై మంత్రి దిశానిర్దేశం చేశారు. "ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు పెట్టి భవనాలు కట్టవచ్చు.. కానీ డాక్టర్ అందుబాటులో ఉంటారనే నమ్మకం రోగికి కలిగినప్పుడే ఆ ఆసుపత్రికి సార్థకత ఉంటుంది. డాక్టర్లు, సిబ్బంది ఎక్కడో ఉండటం కాదు.. ఈ హెడ్ క్వార్టర్స్‌లోనే నివసించాలి. చర్ల, మణుగూరు, ఇల్లందు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు అద్భుత ఫలితాలు ఇస్తున్నాయి. ఇక్కడ కూడా అదే అంకితభావం కావాలి. విధుల్లో చిత్తశుద్ధి చూపే సిబ్బందికి నా నియోజకవర్గం తరపున ప్రత్యేక బహుమతులు అందజేస్తాను" అని ప్రకటించారు.

**విద్య, వైద్యమే మా ప్రభుత్వ అజెండా**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదవాడికి నాణ్యమైన చదువు, వైద్యం అందించడమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. "కేవలం వైద్యమే కాదు.. రాబోయే రోజుల్లో విద్యారంగంలోనూ విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. గడిచిన రెండేళ్ల మూడు నెలల కాలంలోనే మౌలిక వసతుల కల్పనలో మనం ఎంతో పురోగతి సాధించాం. ఈ ప్రభుత్వం ఎవరినీ నొప్పించదు.. కానీ ఉద్యోగులు బాధ్యతగా పనిచేసి ప్రజలకు ఫలితాలు అందించాలి" అని స్పష్టం చేశారు.

**కాంట్రాక్టర్ కి ఆదేశాలు...**

"మార్చిలో పనులు మొదలవుతున్నాయి.. యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, మళ్లీ డిసెంబర్ నాటికే ఈ ఆసుపత్రిని ప్రారంభించాలి" అని గడువు విధించారు. అనంతరం మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు , మండల నాయకులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై యువతకు అవగాహన కల్పించిన రాజోలి పోలీసులు

**జోగులాంబ గద్వాల, మార్చి05 (తెలంగాణ ముచ్చట్లు):**




రాజోలి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో రాజోలి పోలీసు సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటిపి వివరాలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని తెలిపారు. ఆర్టీవో చలాన్, కేవైసీ నవీకరణ, పీఎం కిసాన్ పేర్లతో పంపే ఏపీకె ఫైళ్లను తెరవకూడదని హెచ్చరించారు. తెలియని లింకులు లేదా అనుమానాస్పద సందేశాలను క్లిక్ చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం దొంగిలించబడే ప్రమాదం ఉందని వివరించారు. చట్టపరంగా డిజిటల్ అరెస్ట్ అనే ప్రక్రియ లేదని, అలాంటి పేర్లతో వచ్చే మోసపూరిత కాల్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే టోల్ ఫ్రీ సంఖ్య 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాలాక్షి రెడ్డి, ఆంజనేయులు, మధుమోహన్ పాల్గొన్నారు.

# గ్రేటర్ నోయిడాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం

- **కేడీఎస్‌జీ ఆసుపత్రిని ప్రారంభించిన ముఖ్యమంత్రి**
- **ఆరోగ్య సేవల్లో కొత్త ప్రమాణాలు స్థాపన లక్ష్యం**
- **ఆసుపత్రి నిర్వహకులకు అభినందనలు**

**గ్రేటర్ నోయిడా, 5 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ గ్రేటర్ నోయిడాలో కేడీఎస్‌జీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ఆసుపత్రి సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న “కొత్త ఉత్తర ప్రదేశ్”లో ఆరోగ్య రంగానికి ఇది మరో ముఖ్యమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ ఆసుపత్రి జాతీయ రాజధాని ప్రాంతంలో అత్యుత్తమ వైద్య సేవలు అందించే కేంద్రంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఆధునిక సదుపాయాలతో ఏర్పాటైన ఈ ఆసుపత్రి ప్రాంతీయ ప్రజలకు మెరుగైన చికిత్స అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఆసుపత్రి స్థాపకుడు మరియు నిర్వాహకుడు కపిల్ దేవ్‌తో పాటు సునీల్ కుమార్ గుప్తా మరియు ఆసుపత్రి నిర్వహణ బృందానికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఆరోగ్య సేవల అభివృద్ధికి వారు చేస్తున్న కృషి ప్రశంసనీయం అని పేర్కొన్నారు.




నూతన ఆసుపత్రి ప్రారంభంతో ప్రాంతీయ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఆరోగ్య రంగంలో ఇది కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుందని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# భారత్–ఫిన్లాండ్ సంబంధాలు మరింత బలోపేతం

- రాష్ట్రపతి భవన్‌లో కీలక భేటీ
- ఆవిష్కరణ, స్వచ్ఛ సాంకేతికతలపై చర్చలు
- వాణిజ్యం, విద్య రంగాల్లో సహకార విస్తరణ

**న్యూఢిల్లీ:** ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృత స్థాయిలో చర్చలు జరిగాయి. భారత్ ఫిన్లాండ్‌ను విశ్వసనీయమైన, విలువైన భాగస్వామిగా భావిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. రెండు దేశాల మధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు ఇటీవల కాలంలో మరింత బలపడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆవిష్కరణలు, స్వచ్ఛ సాంకేతికతలు, విద్య, ఆర్థిక రంగాలు మరియు వాణిజ్య సహకారం వంటి కీలక అంశాలపై నాయకులు అభిప్రాయాలను పంచుకున్నారు. భారత్ మరియు ఫిన్లాండ్ మధ్య సంబంధాలు ప్రస్తుతం సాంకేతికత ఆధారిత భాగస్వామ్యంగా అభివృద్ధి చెందుతున్నాయని రాష్ట్రపతి తెలిపారు. పరిశోధన, విజ్ఞాన సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించడానికి ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని ఆమె చెప్పారు. ప్రత్యేకంగా డిజిటల్ మార్పు, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ శక్తి మరియు నూతన సాంకేతిక రంగాల్లో రెండు దేశాల మధ్య ఉన్న అవకాశాలను నాయకులు చర్చించారు. విద్యా రంగంలో విద్యార్థుల మార్పిడి, పరిశోధన సహకారం, నూతన ఆవిష్కరణల ప్రోత్సాహం వంటి అంశాలపై కూడా పరస్పర అవగాహన పెంచుకోవాలని నిర్ణయించారు. ఈ సహకారం రెండు దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని భావించారు. రెండు దేశాలు అంతర్జాతీయ వేదికలపై కూడా కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయిలో శాంతి, అభివృద్ధి మరియు స్థిరత్వాన్ని పెంపొందించే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని వారు తెలిపారు. భారత్-ఫిన్లాండ్ మధ్య కొనసాగుతున్న సాన్నిహిత్యం భవిష్యత్తులో మరింత బలపడుతుందని ఈ భేటీ సందర్భంగా విశ్వాసం వ్యక్తమైంది.



# మధ్యప్రాచ్య ఉద్రిక్తతల ప్రభావం.. విమాన టికెట్లు భారీగా పెరుగుదల

- వ- అమెరికా–భారత్ రూట్లలో ధరల పెరుగుదల
- - గగనతల మార్గాల మూసివేతతో సర్వీసుల మార్పు
- ప్రయాణికులపై పెరిగిన భారం

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు అంతర్జాతీయ విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర అమెరికా మరియు భారత్ మధ్య నడిచే ప్రధాన విమాన రూట్లలో టికెట్ ధరలు భారీగా పెరిగాయి. యుద్ధ పరిస్థితుల కారణంగా కీలక గగనతల మార్గాలను మూసివేయడంతో విమానయాన సంస్థలు తమ సర్వీసులను ప్రత్యామ్నాయ మార్గాల్లో నడపాల్సి వస్తోంది.

సాధారణంగా అమెరికా, యూరప్, ఆసియా ఖండాలను అనుసంధానించే ప్రధాన కేంద్రంగా మధ్యప్రాచ్యం ఉంటుంది. అయితే ప్రస్తుతం అక్కడ నెలకొన్న సంఘర్షణల కారణంగా విమానయాన సంస్థలు ఆ ప్రాంతం మీదుగా ప్రయాణించేందుకు వెనకాడుతున్నాయి. ఫ్లైట్ రాడార్ గణాంకాల ప్రకారం గతంలో విమానాలతో రద్దీగా ఉండే ఈ గగనతలం ఇప్పుడు చాలా వరకు ఖాళీగా కనిపిస్తోంది. దీంతో విమానాలు పొడవైన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడంతో సమయం, ఇంధన ఖర్చులు పెరిగాయి. గూగుల్ ఫ్లైట్స్ గణాంకాల ప్రకారం న్యూయార్క్, షికాగో, నెవార్క్ నగరాల నుంచి ముంబై, న్యూఢిల్లీకి వచ్చే విమాన టికెట్ ధరలు అమాంతం పెరిగాయి. ముఖ్యంగా న్యూయార్క్ నుంచి న్యూఢిల్లీకి వచ్చే విమానాల్లో టికెట్ ధరలు ప్రస్తుతం రూ.1.34 లక్షల నుంచి రూ.2.25 లక్షల వరకు ఉన్నాయి. సాధారణ రోజుల్లో ఇవే టికెట్లు రూ.45 వేల నుంచి రూ.1 లక్ష మధ్య లభిస్తాయి. అంటే ధరలు దాదాపు 100 శాతం పెరిగినట్లైంది. అదేవిధంగా షికాగో నుంచి ముంబైకి వచ్చే విమానాల్లో టికెట్ ధరలు 150 శాతం వరకు పెరిగాయి. ప్రస్తుతం ఈ రూట్‌లో టికెట్ ధరలు రూ.1.9 లక్షల నుంచి రూ.2.8 లక్షల వరకు ఉన్నాయి. అలాగే నెవార్క్-ముంబై, షికాగో-న్యూఢిల్లీ రూట్లలో కూడా టికెట్ ధరలు రెట్టింపు కావడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విమాన మార్గాల్లో మార్పులు కొనసాగితే రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విమానయాన నిపుణులు పేర్కొంటున్నారు.







# అంగరంగ వైభవంగా డిప్యూటీ సీఎం భట్టి కుమారుడి వివాహం

- తరలివచ్చిన రాజకీయ, సినీ దిగ్గజాలు

ఖమ్మం బ్యూరో, మార్చి 5(తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పెద్ద కుమారుడు సూర్య విక్రమాదిత్య మల్లు వివాహ వేడుక శంషాబాద్‌లోని జీఎంఆర్ ఎరీనాలో అత్యంత వైభవంగా జరిగింది. గురువారం ఉదయం 9 గంటల నుంచే ప్రారంభమైన ఈ వేడుకకు దేశ, రాష్ట్ర రాజకీయ ప్రముఖులు, సినీ రంగ దిగ్గజాలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

**హాజరైన ప్రముఖులు:**

ఈ వివాహ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో ప్రముఖులు వీరే..

**రాజకీయ ప్రముఖులు:** ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి. చిదంబరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

**ప్రతిపక్ష నేతలు:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీష్ రావు, గంగుల కమలాకర్, మల్లారెడ్డి మాజీ ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.

**బీజేపీ నేతలు:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ.

**సినీ ప్రముఖులు:** మెగాస్టార్ చిరంజీవి, కింగ్ నాగార్జున, హీరో శ్రీకాంత్, ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి తదితరులు.

**అభిమానుల మధ్య డిప్యూటీ సీఎం:**

రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో వివాహ వేదిక సందడిగా మారింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన హోదాను పక్కన పెట్టి, వచ్చిన ప్రతి ఒక్కరి వద్దకు వెళ్లి పేరుపేరునా పలకరించడం విశేషం. వారితో కలిసి ఫోటోలు దిగుతూ, కుశల ప్రశ్నలు అడుగుతూ వారి పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు మరియు ఇతర రంగాలకు చెందిన ప్రముఖుల రాకతో జీఎంఆర్ ఎరీనా పరిసరాలు కోలాహలంగా మారాయి.

# అధికార హోదా ఉన్నా.. ఆత్మీయతకే పెద్దపీట!

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడి వివాహంలో 'పాదయాత్ర' బంధువుల సందడి

ఖమ్మం బ్యూరో, మార్చి 5(తెలంగాణ ముచ్చట్లు)

రాజకీయ హోదాలు, అధికార దర్పం కంటే మనుషుల మధ్య ఉండే అనుబంధాలే గొప్పవని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిరూపించారు. తన కుమారుడి వివాహ వేడుకను కేవలం ప్రముఖుల కలయికగా మార్చకుండా, కష్టకాలంలో తనకు తోడు నిలిచిన సామాన్యులను ఆహ్వానించి గౌరవించడం ద్వారా ఆయన తన సంస్కారాన్ని చాటుకున్నారు.

**ఆత్మీయ బంధువుల రాక**

తెలంగాణ వ్యాప్తంగా భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో ఆయనకు అండగా నిలిచిన మారుమూల గ్రామాల ప్రజలు ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలోని జైనూర్ మండలం బూసిమెట్టకు చెందిన వాలే లక్ష్మి బాయ్, డాకూర్ రుక్మబాయ్.. అలాగే ఉట్నూరు మండలం దేవగూడకు చెందిన మరప గంగుబాయ్, సిడం లక్ష్మీబాయి, నాగజ్యోతి వంటి మహిళలు ఈ వివాహానికి హాజరై సందడి చేశారు.



కొడుకు, కోడలికి 'కన్నతల్లి' పరిచయం

పాదయాత్ర సమయంలో ఎండనక, వాననక అడుగులు వేస్తున్నప్పుడు తనను కన్నబిడ్డలా ఆదరించి, ఆకలి తీర్చిన తీరును భట్టి విక్రమార్క స్వయంగా తన కుమారుడు, కోడలికి వివరించారు. "వీరే నన్ను ఆనాడు కంటికి రెప్పలా చూసుకున్న నా ఆత్మీయులు" అని ఆయన పరిచయం చేస్తుంటే అక్కడ ఒక భావోద్వేగ వాతావరణం నెలకొంది.

**పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం**


ఈ వేడుకలో మరో ముఖ్య ఘట్టం అందరినీ ఆకట్టుకుంది. కేవలం అతిథులుగా వారిని ఆహ్వానించడమే కాకుండా, ఆ పెద్దమ్మల పాదాలకు నూతన వధూవరులు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు.

**అధికార హోదాలో ఉన్నా కూడా**

సామాన్యుల పట్ల చూపిన ఈ వినమ్రతపై అతిథులు ప్రశంసలు కురిపించారు. వధూవరులు నూరేళ్ల పాటు చల్లగా ఉండాలని ఆ గ్రామీణ మహిళలు మనస్ఫూర్తిగా దీవించారు.
కష్టకాలంలో తోడున్న వారిని గుర్తుపెట్టుకోవడం, వారికి సముచిత గౌరవం ఇవ్వడం గొప్ప సంస్కారం" అని వేడుకకు హాజరైన వారు చర్చించుకోవడం కనిపించింది.






# న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని బాధితుల్లో కలిగించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

ధర్మసాగర్,మార్చి05(తెలంగాణ ముచ్చట్లు):

పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ రోజు ఉదయం పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు ధర్మసాగర్ ఇన్స్ స్పెక్టర్ శ్రీధర్ రావు పుష్పాగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, ఆయా గ్రామాల్లోకి ప్రజల జీవన శైలి, పోలీస్ స్టేషన్ పరిధిలో అధికంగా జరిగే నేరాలు, రౌడీ షీటర్లు, అనుమానితులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు, బీట్లు, పెట్రోలింగ్, రికార్డుల నిర్వహణ పై స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన కేసులు, పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్ కు సంబందించి రికార్డులను సీపీ పరిశీలించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఫిర్యాదులపై స్టేషన్ అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించాలని, విధి నిర్వహణలో అలసత్వంతో వ్యవహరించకుండా విధులు నిర్వహించాలని, ముఖ్యంగా పారదర్శకంగా విధులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని పొందాలని సీపీ తెలియజేసారు. పోలీస్ కమిషనర్ వెంట సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తో పాటు, ఎస్. ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సుఖోయ్ యుద్ధ విమానం అదృశ్యం

- రాడార్‌తో సంబంధాలు తెగిపోవడం కలకలం
- సెర్చ్ అండ్ రెస్క్యూ చర్యలు ప్రారంభం
- పైలట్ల ఆచూకీ కోసం గాలింపు

న్యూఢిల్లీ, 5 మార్చి (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): భారత వాయుసేనకు చెందిన సుఖోయ్ ఎస్ యూ-30ఎంకేఐ యుద్ధ విమానం రాడార్‌తో సంబంధాలు కోల్పోయి అదృశ్యమవడం కలకలం రేపింది. విమానం రాడార్ పరిధి నుంచి హఠాత్తుగా మాయమవడంతో అధికారులు వెంటనే అప్రమత్తమై గాలింపు చర్యలు ప్రారంభించారు.
విమానం రాడార్ కాంటాక్ట్ కోల్పోయినట్లు అధికారులు నిర్ధారించారు.
ఈ ఘటనతో పైలట్ల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. వెంటనే సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను రంగంలోకి దించి విమానం ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటనపై లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర రావత్ స్పందిస్తూ విమానం రాడార్ కాంటాక్ట్ కోల్పోయిన మాట వాస్తవమేనని తెలిపారు. ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. సుఖోయ్ ఎస్ యూ-30ఎంకేఐ భారత వాయుసేనలో అత్యంత శక్తివంతమైన మల్టీ రోల్ ఫైటర్ జెట్‌గా గుర్తింపు పొందింది. రష్యా నుంచి సేకరించిన ఈ విమానాలు సరిహద్దు భద్రతతో పాటు కీలకమైన వైమానిక ఆపరేషన్లలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుతం విమానంలో ఉన్న సిబ్బంది వివరాలు, ఘటనకు కారణాలు తదితర అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.



# భారత్ నెదర్లాండ్స్ రక్షణ సహకారంపై చర్చలు

- సైనిక అధికారుల కీలక భేటీ
- అత్యాధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యం
- ఇండో–పసిఫిక్ భద్రతపై చర్చ

భారత్ మరియు నెదర్లాండ్స్ మధ్య రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక భేటీ జరిగింది. సమగ్ర రక్షణ సిబ్బంది ప్రధాన అధికారి ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నెదర్లాండ్స్ రక్షణ విభాగ ప్రత్యేక ప్రతినిధి రియర్ అడ్మిరల్ జానెట్ మోరాంగ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్-నెదర్లాండ్స్ మధ్య కొనసాగుతున్న రక్షణ సహకారంపై ఇద్దరు అధికారులు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా అత్యాధునిక సాంకేతికతలు, సైనిక శిక్షణ మరియు వృత్తిపరమైన సైనిక విద్య రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు ఆసక్తి చూపినట్లు తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భద్రతను బలోపేతం చేయడం, సముద్ర మార్గాల రక్షణ మరియు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై కూడా చర్చలు జరిగాయి. ఈ ప్రాంతంలో శాంతి, భద్రతను కాపాడేందుకు రెండు దేశాలు కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డాయి. ఈ సమావేశంతో భారత్ మరియు నెదర్లాండ్స్ మధ్య రక్షణ సంబంధాలు మరింత బలపడతాయని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు.




## అమెజాన్‌లో ఉద్యోగాల కోత – రోబోటిక్స్ విభాగంపై ప్రభావం

ప్రసిద్ధ ఈకామర్స్ దిగ్గజం అమెజాన్‌లో మరోసారి ఉద్యోగాల కోత చేపట్టడం ఆందోళన కలిగిస్తోంది. 2026లో రెండు నెలల కాలంలో కంపెనీ 16 వేల మంది ఉద్యోగులను తొలగించడం ఇప్పటికే వార్తగా మారింది. తాజాగా, రోబోటిక్స్ విభాగంలోని సుమారు 100 మంది ఉద్యోగులు ఈ కోతకు గురయ్యారని సంబంధిత వ్యక్తులు మీడియాకు తెలిపారు. అమెజాన్ లేఆఫ్‌లను ధృవీకరించినప్పటికీ, ఖచ్చితంగా ఎంతమంది ఉద్యోగులను తొలగించారన్నది వెల్లడించలేదు. అమెజాన్ గోదాముల్లో పనిని ఆటోమేషన్ చేయడానికి రోబోలను డిజైన్ చేసే ప్రత్యేక రోబోటిక్స్ టీమ్ ఉంది. ఈ రోబోటిక్స్ టీమ్‌పై ఇప్పుడు లేఆఫ్ ప్రభావం పడింది. కంపెనీ ఖర్చులను తగ్గించడానికి, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికతను వినియోగిస్తూ, రోబో తయారీని నిలిపివేసింది. ఈ ప్రక్రియలో కొద్ది ఉద్యోగులను తొలగించడం కంపెనీ నిర్ణయం అయింది.

గత ఏడాది అక్టోబర్‌లో అమెజాన్ 14 వేల మందిని తొలగించింది. 2026లో, జనవరిలో 16 వేల మంది ఉద్యోగులపై వేటు వేసింది. కృత్రిమ మేధ, వ్యయం తగ్గింపు విధానాల కారణంగా, ఈ కొద్ది కాలంలో మొత్తం 30 వేల మంది ఉద్యోగులు కంపెనీ నుండి విడిపోయారు. ఈ పరిణామం రోబోటిక్స్, వేర్ హౌస్ ఆటోమేషన్ విభాగాలపై ముఖ్య ప్రభావాన్ని చూపుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ లేఆఫ్‌ల కారణంగా ఆఫీస్ మరియు వేర్ హౌస్ పనితీరు మరింత ఆటోమేటెడ్ విధానంలో సాగే అవకాశం ఉంది. తద్వారా, కంపెనీ ఖర్చులను తగ్గిస్తూ, సాంకేతికతను మరింత విస్తరించడానికి సిద్ధంగా ఉంది. ఉద్యోగుల భద్రత, రీట్రైనింగ్ అవకాశాలు మరియు కొత్త ఉద్యోగాల సృష్టివంటి అంశాలు ఇక్కడ ముఖ్యంగా పరిశీలనకు వస్తున్నాయి.

# వార్ ఎఫెక్ట్.. భారత్ బాస్మతి బియ్యం ఎగుమతులకు తలెత్తిన సమస్యలు



మధ్యప్రాచ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు భారత మార్కెట్లపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన సుగంధ బాస్మతి బియ్యం ఇప్పుడు ఢిల్లీలోని నయా బజార్ గిడ్డంగుల్లో నిలిచిపోతోంది. ఎగుమతులు దాదాపు పూర్తిగా ఆగిపోయాయి. వ్యాపారులు, రైతులు, ఎగుమతిదారులు, దేశ ఆర్థిక వ్యవస్థపై దీని భారం పడుతోంది. ఎగుమతిదారుల ప్రకారం, సుమారు 4 లక్షల టన్నుల బాస్మతి వివిధ ప్రదేశాల్లో నిలిచిపోయింది. కొన్ని సరుకులు సముద్రంలోనే నిలిచిపోయాయి, మరికొన్ని ఓడరేవుల్లో నిలిచాయి. గిడ్డంగుల్లో భారీ నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ సమస్య కేవలం ఇరాన్‌కే పరిమితం కాదు; ఇరాక్, బహ్రెయిన్, కువైట్, ఖతర్ వంటి గల్ఫ్ దేశాల మార్కెట్లు కూడా ప్రభావితమయ్యాయి.

ధరల్లో క్షీణత స్పష్టంగా కనిపిస్తోంది. ఫిబ్రవరిలో బలమైన డిమాండ్ కారణంగా బాస్మతి ధరలు 5-10 శాతం పెరిగాయి, కానీ యుద్ధం ప్రారంభమైన తర్వాత మార్కెట్ క్షీణించింది. గత నాలుగు రోజుల్లోనే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు దాదాపు 10 శాతం పడిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. దేశీయ మార్కెట్లో కూడా 5-6 శాతం వరకు ధరలు తగ్గాయి. యుద్ధ పరిస్థితులతో పాటు అమెరికా ఆంక్షల ముప్పు కూడా ఇరానియన్ కొనుగోలుదారుల నుండి చెల్లింపులు స్వీకరించడంలో అనిశ్చితిని పెంచింది. వాణిజ్య నౌకలకు బీమా కవరేజ్ పొందడం కష్టమవడంతో సరుకు రవాణా నిలిచిపోయింది.

గల్ఫ్ మార్కెట్ భారత బాస్మతి బియ్యానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాంతం. భారత బాస్మతి ప్రధానంగా పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో పండుతుంది. దేశం మొత్తం బాస్మతి ఎగుమతుల్లో దాదాపు 70 శాతం గల్ఫ్ దేశాలకు వెళ్తుంది, అందులో ఇరాన్ ఒక్కటే సుమారు 25 శాతం వాటా కలిగి ఉంది. 2024-25లో భారత్ ఇరాన్‌కు సుమారు ₹6,374 కోట్లు విలువైన బాస్మతి బియ్యం ఎగుమతి చేసింది. ఈ ప్రధాన మార్కెట్ అకస్మాత్తుగా మూసుకుపోవడం వల్ల రైతుల ఆదాయంపై, ఎగుమతిదారుల లాభాలపై, దేశ వ్యవసాయ వాణిజ్య సమతుల్యతపై గణనీయమైన ప్రభావం పడే అవకాశం ఉంది. పరిస్థితి త్వరగా సాధారణ స్థితికి రాకపోతే, బాస్మతి రంగం దీర్ఘకాలిక సవాళ్లను ఎదుర్కొనాల్సి రావచ్చు.

# గెలాక్సీ A57, A37 ధరలు భారీగా పెరగనున్నాయి




శాంసంగ్ నుంచి అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న గెలాక్సీ A57 మరియు గెలాక్సీ A37 స్మార్ట్‌ఫోన్ల ధరలు మునుపటి మోడల్స్ కంటే భారీగా పెరగవచ్చని టెక్ వర్గాల సమాచారం. గ్లోబల్ మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితులు, పెరుగుతున్న విడిభాగాల ధరలు దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

ధరలు పెరగడానికి కొన్ని ముఖ్య కారణాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా సెమీకండక్టర్లు మరియు ప్రాసెసర్ల ధరలు పెరగడం వల్ల ఫోన్ తయారీ వ్యయం పెరిగింది. అలాగే, శాంసంగ్ తన ప్రీమియం ఫోన్లలో అందించే ఫీచర్లను ఇప్పుడు ఈ మిడ్‌రేంజ్ ఫోన్లలో కూడా ప్రవేశపెడుతోంది, దీని వల్ల సాఫ్ట్‌వేర్ విలువ పెరిగింది. అదనంగా, మెరుగైన డిస్ప్లే క్వాలిటీ మరియు హైఎండ్ కెమెరా సెన్సార్ల వాడకం కూడా ధరల పెరుగుదలకు కారణంగా మారింది.

మార్కెట్‌లో శాంసంగ్ వ్యూహం ప్రకారం, చైనీస్ బ్రాండ్లతో గట్టి పోటీ ఉన్నప్పటికీ, శాంసంగ్ తన నాణ్యత, సెక్యూరిటీ మరియు క్రమం తప్పకుండా వచ్చే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లపై భరోసా ఇస్తోంది. అయితే, మిడ్‌రేంజ్ విభాగంలో ధరలు పెరగడం వల్ల వినియోగదారులు ఇతర బ్రాండ్ల వైపు మళ్లే అవకాశం ఉందని టెక్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.




## భారీ లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

అమెరికా మరియు ఇరాన్ మధ్య నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతాయన్న వార్తలతో దేశీయ స్టాక్ మార్కెట్ ఒక్కసారిగా పరుగులు తీశాయి. ఇరాన్ తన అణు కార్యక్రమంపై మెత్తబడటం ఇన్వెస్టర్లలో కొత్త ఆశలను చిగురింపజేసింది. దీని ప్రభావంతో దలాల్ స్ట్రీట్‌లో కొనుగోళ్ల జోరు పెరిగి, సూచీలు భారీ లాభాలను నమోదు చేశాయి. అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిస్థితులు మన మార్కెట్లకు భారీ ఊరటనిచ్చాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

గురువారం ట్రేడింగ్‌లో బాంబే స్టాక్ ఎక్స్చేంజి సూచీ సెన్సెక్స్ ఏకంగా 900 పాయింట్లు లాభపడి 80,000 మార్కును అధిగమించింది. అదే సమయంలో నిఫ్టీ కూడా 285 పాయింట్లు ఎగబాకి 24,765 వద్ద స్థిరపడింది. ప్రధానంగా మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, నిర్మాణ రంగ షేర్లు అద్భుతమైన పనితీరును కనబరిచాయి. అదానీ పోర్ట్స్ మరియు ఎల్అండ్‌టీ వంటి దిగ్గజ సంస్థల షేర్లు ఈరోజు టాప్ గెయినర్లుగా నిలిచి మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. మార్కెట్లో భయాందోళనలను సూచించే ఇండియా విక్స్ ఏకంగా 16 శాతం తగ్గడం విశేషం. ఇది మార్కెట్ స్థిరత్వాన్ని మరియు ఇన్వెస్టర్ల నమ్మకాన్ని తెలియజేస్తోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, నిఫ్టీ 25,200 స్థాయిని దాటితే మాత్రమే దీన్ని పూర్తి మార్కెట్ రికవరీగా భావించవచ్చని సూచిస్తున్నారు. ప్రస్తుతానికి 24,600 పాయింట్ల వద్ద నిఫ్టీకి బలమైన మద్దతు లభించే అవకాశం ఉంది. మిడ్ క్యాప్ మరియు స్మాల్ క్యాప్ షేర్లు కూడా ఈ లాభాల్లో చురుగ్గా పాల్గొన్నాయి.

# కేంద్రం గాడిదలు పెంచితే రూ.50 లక్షల సబ్సిడీ ఇస్తోంది



ప్రస్తుత రోజుల్లో గాడిదలకు మంచి గిరాకీ ఏర్పడింది. పూర్వం వీటిని కేవలం బరువులు మోయడానికి మాత్రమే వాడేవారు, కానీ ఇప్పుడు వీటి పాలతో సౌందర్య సాధనాలు, ఔషధాలను తయారు చేస్తున్నారు. దేశంలో వేగంగా తగ్గిపోతున్న గాడిదల సంఖ్యను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా చర్యలు తీసుకుంది. ఈ పెంపకాన్ని ఒక లాభదాయక వ్యాపారంగా మార్చడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. నిరుద్యోగులు మరియు రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఉపాధి మార్గాలను వెతుక్కోవచ్చు. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ కింద, గాడిదలు, గుర్రాలు మరియు ఒంటెల పెంపకానికి కేంద్రం ఆర్థిక సాయం అందిస్తుంది. ఏదైనా ప్రాజెక్ట్ ఖర్చులో 50 శాతం మొత్తాన్ని, గరిష్టంగా ₹50,00,000 వరకు ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుంది. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (FPO), స్వయం సహాయక బృందాలు మరియు సెక్షన్ 8 కంపెనీలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. అంటే, మీరు ఒక కోటి రూపాయల పెట్టుబడితో ఫారం ఏర్పాటు చేస్తే, ప్రభుత్వం సగం భారాన్ని భరిస్తుంది. భారతదేశంలో గాడిదల సంఖ్య గణనీయంగా తగ్గడం వల్ల, ప్రభుత్వం జాతి సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో వీటి పెంపకానికి అనువైన వాతావరణం ఉంది. గాడిద పాలను ఆహార పదార్థంగా గుర్తించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. మార్కెట్లో గాడిద పాలకు లీటరుకు వేల రూపాయల ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ తోడ్పాటుతో గాడిదల ఫామ్ ఏర్పాటు చేయడం భవిష్యత్తులో మంచి లాభాలను తెచ్చిపెడుతుంది.



## బంగారం ధరల్లో మార్పు – నగరాల వారీ రేట్లు

భారతదేశంలో బంగారం ధరలు గురువారం కూడా మార్పులతో కొనసాగుతున్నాయి. పశ్చిమ ఆసియాలో ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల కారణంగా బంగారం కొనుగోలుదారులు, వ్యాపారులు పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నారు. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో పది గ్రాముల ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధర సుమారు ₹1,64,646 వద్ద ఉంది. దేశంలోని బంగారం వ్యాపార సంఘం ప్రకారం, పది గ్రాముల ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ధర ₹1,62,548గా నమోదైంది. ఇరవై మూడు క్యారెట్ల బంగారం పది గ్రాములకు ₹1,61,897, ఇరవై రెండు క్యారెట్ల బంగారం ధర ₹1,48,894, పదహారు క్యారెట్ల బంగారం ధర ₹1,21,912, పద్నాలుగు క్యారెట్ల బంగారం ధర ₹95,901 గా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు కూడా పెరుగుదల దిశలో కదులుతున్నాయి. ఒక ఔన్స్ బంగారం ధర $5,398 కి సమీపంగా ఉండగా, భవిష్యత్ ఒప్పందాల్లో కూడా పెరుగుదల కనిపిస్తోంది. ప్రధాన నగరాల్లో బంగారం ధరలు వేర్వేరు ఉన్నాయి. ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, పాట్నా, లక్నో, బెంగళూరు, హైదరాబాద్, పుణే, నాగపూర్ లాంటి ప్రధాన నగరాల్లో ఇరవై నాలుగు, ఇరవై రెండు, పదహారు క్యారెట్ల ధరలు భిన్నంగా నమోదయ్యాయి. చెన్నైలో ఇరవై నాలుగు క్యారెట్ల బంగారం ₹1,65,820, ఇరవై రెండు క్యారెట్లు ₹1,52,000, పదహారు క్యారెట్లు ₹1,31,000 గా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న రాజకీయ ఉద్రిక్తతలు, డాలర్ విలువలో మార్పులు, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు వంటి అంశాలు బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, బంగారం ధరలకు తక్షణ మద్దతు సుమారు ₹1,48,000 వద్ద ఉండగా, పైస్థాయి ప్రతిఘటన ₹1,65,000 నుండి ₹1,80,000 మధ్య ఉండవచ్చు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# దుస్తుల వివాదంపై వరలక్ష్మీ ఘాటు వ్యాఖ్యలు

నటీమణుల దుస్తుల విషయంలో ఇటీవల జరిగిన వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో పెద్ద చర్చకు దారితీశాయి. నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ స్పందిస్తూ తన అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె తెలిపారు.

వరలక్ష్మీ శరత్‌కుమార్ దర్శకత్వం వహించిన సరస్వతి చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ అంశంపై మాట్లాడారు. నటిగా ఉన్నప్పుడు తన పాత్రపైనే దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుందని, కానీ దర్శకురాలిగా మొత్తం చిత్ర బాధ్యత తనపై ఉంటుందని తెలిపారు. నటనతో పోలిస్తే దర్శకత్వం పూర్తిగా భిన్నమైన అనుభవమని ఆమె వివరించారు.

నటీమణుల దుస్తులపై వస్తున్న విమర్శల గురించి ప్రశ్నించగా, ఒక వ్యక్తి ఏ దుస్తులు ధరించాలనేది పూర్తిగా వారి వ్యక్తిగత నిర్ణయమని ఆమె అన్నారు. దుస్తుల ఆధారంగా ఒక మహిళను తీర్పు చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. ఒక అమ్మాయి అనుకోకుండా లోదుస్తుల పట్టీ బయటకు కనిపించినా దాన్ని పెద్ద విషయంగా చూపించడం సమంజసం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. అది మహిళల కోసం సాధారణమైన వస్త్రమేనని, దానిని వివాదాస్పదంగా మార్చడం సమాజంలో ఉన్న తప్పుడు ఆలోచనల ఫలితమని వ్యాఖ్యానించారు. మగవారి దుస్తుల విషయాన్ని ప్రస్తావిస్తూ కూడా ఆమె ఉదాహరణ ఇచ్చారు. పురుషులు వంగినప్పుడు వారి లోదుస్తులు కనిపించినా దాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోరని, అయితే మహిళల విషయంలో మాత్రం ద్వంద్వ వైఖరి ఎందుకు అనుసరిస్తున్నారో అర్థం కావడం లేదని ప్రశ్నించారు. ఈ రకమైన భావజాలం మారాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. మహిళల దుస్తులను విమర్శించడం కంటే మన ఆలోచనలను మార్చుకోవడం ముఖ్యమని వరలక్ష్మీ శరత్‌కుమార్ సూచించారు. సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం అత్యంత అవసరమని, వారి స్వేచ్ఛను పరిరక్షించడం అందరి బాధ్యత అని తెలిపారు. ప్రస్తుతం ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీస్తున్నాయి. కొందరు ఆమె అభిప్రాయాలను సమర్థిస్తుండగా, మరికొందరు భిన్నంగా స్పందిస్తున్నారు. అయితే మహిళల హక్కులు, స్వేచ్ఛల అంశం మళ్లీ ప్రధాన చర్చాంశంగా మారింది.




# ఉస్తాద్ ఊచకోతకు తేదీ ఖరారు

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ రాజకీయ బాధ్యతలతో పాటు సినీ చిత్రాల పనులను కూడా సమాంతరంగా కొనసాగిస్తున్నారు. ఇటీవల రెండు చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆయన, హరిహర వీరమల్లు చిత్రంతో ఆశించిన స్థాయిలో విజయాన్ని సాధించకపోయినా, ఓజీ చిత్రంతో భారీ విజయం అందుకున్నారు. ఇప్పుడు ఆయన నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంపై నిర్మాణ సంస్థ స్పష్టత ఇచ్చింది. ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ శక్తివంతమైన పోలీసు అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే చిత్రీకరణ వేగంగా సాగుతుండగా, పవన్ కళ్యాణ్ తనకు సంబంధించిన భాగాల చిత్రీకరణను పూర్తిచేసినట్లు సమాచారం. ఆయన సరసన శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. సంగీతాన్ని దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. భారీ వ్యయంతో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. గతంలో పవన్ కళ్యాణ్ – హరీష్ శంకర్ కలయికలో వచ్చిన గబ్బర్ సింగ్ భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ కలయికపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. తాజాగా విడుదల చేసిన పోస్టర్ ద్వారా చిత్ర విడుదల తేదీపై పూర్తి స్పష్టత ఇచ్చారు. మొదట ఈ చిత్రాన్ని మార్చి 26న విడుదల చేయాలని యోచించారు. అయితే అదే నెలలో విడుదల కావాల్సిన కొన్ని భారీ చిత్రాలు వాయిదా పడటంతో పరిస్థితులు మారాయి. పెద్ది చిత్రాన్ని ఏప్రిల్ 30కు మార్చగా, ది ప్యారడైజ్ చిత్రాన్ని ఆగస్టు నెలకు వాయిదా వేశారు. టాక్సిక్ చిత్రం కూడా విదేశీ పరిస్థితుల కారణంగా వాయిదా పడింది. అలాగే మార్చి 19న రావాల్సిన డెకాయిట్ చిత్రం విడుదలను కూడా వాయిదా వేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న ప్రదర్శన మందిరాలను దృష్టిలో పెట్టుకుని ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాన్ని మార్చి 19న విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు.

# 'కార్మేని సెల్వం' రిలీజ్ తేదీ ప్రకటింపు

తమిళ నటులు, దర్శకులు సముద్రఖని, గౌతమ్ వాసుదేవ్ మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ద్విభాషా చిత్రం కార్మేని సెల్వం. ఈ చిత్రానికి రామ్ చక్రి దర్శకత్వం వహిస్తున్నారు. పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్ పై అరుణ్ రంగరాజులు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని, తాజాగా రిలీజ్ తేదీని ప్రకటించింది. మేకర్స్ ప్రకారం, ఈ సినిమా ఏప్రిల్ 3, 2026న తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీ.వీ. ఆర్ ఐనాక్స్ పిక్చర్స్ థియేట్రికల్ పార్ట్నర్‌గా వ్యవహరిస్తున్నందున, దేశవ్యాప్తంగా సినిమా భారీ స్థాయిలో విడుదల అవుతుంది. ఒక సాధారణ కార్ డ్రైవర్ సెల్వం జీవితం చుట్టూ సాగే కథ, ఆధునిక సమాజంలోని ఒత్తిళ్లు, నిజాయితీగా జీవించేందుకు చేసే పోరాటంకు చూపించబడుతుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ కు మంచి స్పందన లభించగా, త్వరలోనే టీజర్ విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తున్నది. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విభిన్నమైన మ్యూజిక్ టెక్నాలజీ ద్వారా సంగీతాన్ని అందించడం జరుగుతుంది.




Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in